కథానిక

# వంత జీవితపు వింత

ఎ. ఎల్. ఎన్. సోమయాజులు

నిన్నటికి గిరిజ వయస్సు ఏడేళ్లు మాత్రమే. కాని యీ వేళ- పదిహేనేళ్ల వయస్సుతో మిసమిసలాడే యౌవనపు పొంగుతో కళకళలాడుతోంది. ఈ ఎనిమిదేళ్ళూ గిరిజని పసితనంలోంచి పడుచుతనంలోకి విసిరేసేయి. అలల చలనాన్ని మార్పునొందించే మారుత గీతివలె గిరిజను నూతన జీవితాధ్యాయంలోనికి గొంపోయింది కాలం.

అనివార్యమైన మార్పు నీడలు చాచుకుంటుంది. అది సహజం. కాలపరిణామశీలం. నిప్పు తాకినా నొప్పిపొందని వ్రేళ్ళని దూరాన్నించే అగ్గి సెగ దుస్సహంగా పీడిస్తోంది. నిన్న ప్రపంచమంతా వీణాగానంతో స్వచ్ఛందంగా దర్శనమిచ్చింది. కాని యీవేళ సంతోష ఉల్లాసాల్ని కనులారా చూడటానికైనా నోచుకోలేని దుస్థితి ఏర్పడింది. నిన్న గిరిజ ఆనందఉల్లాసాల్లో ఆటబొమ్మ. కాని ఈవేళ ఎదిగిన ఒక బాధ్యతాయుత వ్యక్తి. ఇదే జీవితం. జీవితపు లెక్కింపు.

నిర్నిరోధకమైన హాసతారకలు పెదవుల మెదలుతున్నా నొసలు మాత్రం విచారాన్ని వీడలేకపోయింది.

అద్దం ముందు నిల్చుని ఆకారాన్ని పరిశీలించుకొంది. ఎంత మారిపోయింది తను! పసితనంలో గిరిజకూ, పడుచుతనంలో గిరిజకూ మధ్యగల వ్యత్యాసాన్ని నిర్లిప్తంగాఘోషించిందామెలోని నిగూఢస్వరం. అప్పుడు తను యౌవన ప్రాంగణంలో ఎన్నడు అడుగుపెడతానా అని తహతహలాడేది. కాని యీవేళ గడచిన ఆ బాల్యంకోసం కలలు కంటోంది... కలవరిస్తోంది. నిన్నటి స్వప్నం నేటి ఒక నగ్న సత్యమై మెరిసింది. ఆమె నేటి వైనతో అభిలషించిందో అవన్నీ గగనకుసుమాలుగానే ఉండిపోయేయి. ఆమె వాంఛాసముద్రానికి వంతెన కట్టలేకపోతోంది.

గిరిజ గదిలో అడుగుపెట్టింది. గాలి విపరీతావేశంతో వీస్తున్నట్లనిపించింది. ఆ గదిలోని ప్రతి వస్తువు, ప్రతిఅణువూ తనవైపువింతగాచూస్తున్నట్లనిపించింది అవన్నీ తన యేకాంతాన్ని నొక్కి నొక్కి చెపుతున్నాయ్. ఆ యేకాంతమే ఆమెను క్రమక్రమంగా అవ్యక్త విశ్వాతీత సీమల్లోకి విసిరివేసింది.

నాలుగు మాసాలక్రితం ప్రశాంత వాతావరణంలో గిరిజ పరిణయం సమాప్తమయింది. బ్రహ్మానందాన్ని పుణికి పుచ్చుకొని, అవ్యాజ మాధుర్యాన్ని పొందదగిన రాత్రి కూడా గడచి గట్టెక్కింది. విశిష్టమైన బతుకుబాటలో పయనం చేద్దామనుకుంది. కాని ఆ బాటలో పొగమంచు దట్టంగా పట్టి దారే కనిపించని స్థితికివచ్చింది.

గిరిజ క్రమక్రమంగా నిరుత్సాహి అవుతోంది. ఆమెలోని శక్తి క్షణక్షణానికి క్షీణించిపోతోంది. ఏనాడయితే తనకా హాలాహలసంపూరితమైనరాత్రి గడచి గట్టెక్కిందో...ఆనాడే అమ్మయ్య! వైతరిణి దాటేసేననుకుంది. కాని ముందున్నది కంటకావృతమైనబాటన్న సంగతి యిప్పుడిప్పుడే జ్ఞప్తికి వస్తోంది.

పక్కమీద పడుకొని పరిసరాలు పరిశీలిస్తోంది. ఈ ఎనిమిదేళ్ళలో ప్రతివస్తువూ ఆమెకు సుపరిచితమే. ఒకప్పుడు తన అక్కే ఆ యింటికి యజమానురాలు. కాని ఆరు మాసాల క్రిందటే తన అక్క యీ లోకాన్ని విడిచి శాశ్వతంగా నిష్క్రమించింది. తన అక్క స్థానంలో తాను నిలవడం జరిగింది.

గిరిజ కంపించింది. ఎనిమిదేళ్ళక్రితం తన అక్కను వెంటబెట్టుకొనిపోయిన వ్యక్తే యీవేళ తనభర్త... ఈవేళ అతడుతనని 'గిరిజారాణీ' అని సంబోధిస్తాడు. కాని యీవేళ ఆ మృదువైన పదాలే ఒక నూతన అర్థాన్ని, నవ వసంత వన్నెనూ, ఒక క్రొత్త ప్రతిష్ఠను తీసుకొని వచ్చినయ్.

పవిత్రమైన హోమగుండమందు జీవితభాగస్వామినిగా ఆమెను జతపర్చుకున్నాడు. తను పూర్వం చేసిన ప్రమాణాలను పూర్తిగా మరచిపోయేడు. నాడు వక్షశాఖలక్రింద లేచిన నివురుగప్పిన నిప్పునే కన్నీటి చిలకరింపుతో సమసి

పోజేసి తానొక క్రొత్తమొక్కను నాటుకున్నాడు...అబ్బ! ఎలా ఉదాసీనంగా ఉండగలిగేడతను?...ఎంత కఠినహృదయుడో!...

చిన్నికృష్ణ ఆడుకుంటూ ఆడుకుంటూ గిరిజ ఒడిలోకి దూకింది. ఆ క్షణంలో గిరిజ ఆ అమాయక వదనాన్ని తనివితీరాచూచి ముద్దెట్టుకుంది. వెంట్రుకలు నిమురుతూ తనఒళ్ళో కూర్చోబెట్టుకుంది. నిన్నటివరకు గిరిజ తన చిన్నమ్మ. కాని యీ వేళ తన మారుటితల్లి.

“చిన్నమ్మా!” కృష్ణ కేక వేసింది. “అమ్మ ఎక్కడికెళ్ళింది చిన్నమ్మా? అమ్మతోకూడా పంపించలేదేం?” అమాయకంగా అడిగింది.

గిరిజ మనస్సు మథన పడింది. కళ్ళు చెమ్మగిల్లాయి. కృష్ణ యింకా అమ్మకోసం ఎదురు చూస్తోంది. మాతృ ప్రేమ అటువంటిది. తను ‘అమ్మ’లా వ్యవహరించగలదా? ‘గిరిజారాణి’ లాంటి పదాలు నూతన అర్థాన్ని వ్యక్తీకరింపజేస్తాయేమో! ఈ పదాల అర్థాన్ని తెలికోడానికి కృష్ణబుల్లి బుర్రకంత విశిష్టతుందా? కాని కృష్ణకవేమీ తెలియదు. ఆమెకితెలిసే అర్థమల్లా గిరిజ తన చిన్నమ్మ. తను గిరిజ అక్కకూతురు.

కృష్ణ యింకా ప్రత్యుత్తరంకోసం ఎదురు చూస్తోంది. “వెళ్ళి ఆడుకోతల్లీ! లక్ష్మి ఒంటరిగా ఉంది” అంది గిరిజ.

“అదికాదు చిన్నమ్మా! అమ్మ రేపటికల్లా వస్తుందా?” మళ్ళీ అదేప్రశ్న. అదే ఆత్రుత. అదే ధ్యానముద్ర...

గిరిజ చలించిందా పిలుపులోని మాటలతో. ఏం ప్రత్యుత్తరమివ్వాలో అర్థంకాలేదు. అంతు చిక్కక అచేతనంగా “నువ్వు లక్ష్మిని కొట్టకుండా ఉన్నప్పుడే వస్తుంది తల్లీ!” అంది.

ఆ మాటలు కృష్ణని సంతృప్తిపరచినయ్. కృష్ణ తన చిన్నారిచేతులతో చిన్నమ్మచేతులను పట్టి అవ్యక్తానందంతో ముద్దుపెట్టుకుంది. తనప్రశ్నకు సరైన సమాధానం లభించినట్లు...

తటాలున అగ్నిజ్వాలలు చుట్టుముట్టుతున్న అక్క జ్ఞాపకానికివచ్చి కళ్ళు చేతులతో మూసుకొంది. వెక్కి వెక్కి ఏడ్చింది తన అక్కకోసం. ఏడిస్తే చచ్చినవాళ్లు బ్రతికివస్తారా? కాని ఏమిటో యీ హృదయంలోని లాలిత్యం...

గడచిన జీవితసంఘటనలొక్కొటొక్కటిగా గిరిజకు జ్ఞాపకానికొస్తున్నాయ్. తన అమాయక శైశవం - తాను నివసించిన కుటీరం - ప్రేమతో పెంచిన తల్లిదండ్రులు - ప్రియమైన అక్క పరిణయమహోత్సవం - బాజాభజంత్రీలు - ఆహా! ఎంతమధురమైంది అక్కయ్య! అక్కయ్య అందాల భరిణ. కొబ్బరాకులు-ఎర్రని కుంకుమబొట్టు- శాస్త్ర మంత్రోచ్చారణ - హోమం - పూలదండలతో ఒక అపరిచితవ్యక్తి- కాని, ఏమిటో, యీనాడు ఆ అపరిచితవ్యక్తే తనభర్త.

గిరిజ వాస్తవజగత్తులోకి వచ్చింది. మామూలు శూన్యాకాశం. కాలగతి ఎంతవిపరీతమైనది! అబ్బ! ఏం బాల్యం!...ఎంత విసవిసా నడచిపోయింది కాలం? బాల్యయౌవనాల నడుమగా జీవితకుడ్యం క్రమక్రమంగా ఎదురౌతోంది.

గిరిజ చెక్కిళ్ళపై రెండు వేడినీటిబిందువులు రాలినయ్. వెంటనే తుడుచుకుంది. ఈ యిల్లే మొట్టమొదట అక్కయ్యది...తరవాత తనది... తన అక్కయ్య అంతిమాశ్వాసం విడిచిందా ప్రక్కగదిలోనే. అక్కయ్య చెక్కిళ్ళప్పుడు వాడిపోయేయి. చేతుల్లోకి ఎముకలు పొడుచుకొచ్చాయి. తెల్లగా మెరిసే ఆ పలువరస వికారంగా తయారై ఆ ముఖంలో వికృతంగా నవ్వుతున్నయ్. విశాలమైన నీలాలకళ్లు లోపలకు పీక్కుపోయేయి. అక్కయ్య తన చరమఘడియలలోకూడా “గిరిజా! నీ వివాహాన్ని చూడడానికి నోచిపుట్టలేదు” అంది. ఆమె ఇప్పుడెక్కడుందో? ఆమె ఊహలన్నీ గగనకుసుమాలయ్యేయా!

“చూడు - చూడక్కా! నీ గిరిజ వివాహితయింది. చెల్లి శోభనపురేయికూడా గడచి గట్టెక్కింది. ఈరోజునే కాపురానికికూడా వచ్చింది” అని అవ్యక్తంగా అరిచింది గిరిజ.

వెంటనే సంబాళించుకుంది. తన వెన్నెముక విరిగిపోతున్నట్లుగా బాధపడింది. లోకప్పులో మూల ఓ సాలీడు గూడుకట్టుకుని ఉంది. ఇంతలోకి పాపం ఈగఒకటి ఆ దారినివస్తూ ఆవల్లో చిక్కుకుంది. దాన్ని భక్షించేసింది సాలీడుదొర. గిరిజ ఆ సంఘటనను చూడగానే కలవరపాటు పొంది తనఅక్కకిసైతం వినబడేటట్టు గట్టిగా ఏడ్చింది...